# 8 చదువుకున్నోడు

ఎన్నిసార్లు ప్రయత్నించినా బొట్టయినా రాల్చని యూనివర్శిటీ హాస్టల్లోని నల్లా దగ్గరకు మరోసారి ప్రయత్నిద్దామని పోయే పి.జి విద్యార్థిలా చెట్టు దగ్గరికి కెళ్ళాడు ఆనంద్ బాబు— చెట్టెక్కి శవాన్ని భుజంపై వేసుకొని జాగ్రత్తగా చెట్టు దిగాడు—త్వరగా స్మశానం చేరుకోవాలన్న ఉద్దేశ్యంతో గబగబ నడుస్తున్నతనితో భేతాళుడు

"ఓ మానవుడా! నువ్వు నీ కొడుక్కోసం డాక్టర్ సీటో, ఇంజనీర్ సీటు సంపాదించడానికి ప్రయత్నిస్తున్నట్టు కనబడుతున్నావు అవునా—?" అన్నాడు

అవునన్నా కాదన్నా నా కిప్పుడొరిగేదేముంది —? నా కొడుకు ఇంటర్ ఫస్టుక్లాసులో పాసయ్యాడు— రెండు మూడేళ్ళుగా ఇంజనీరింగ్ సీటు కొరకు ఎంట్రన్సు పరీక్షలు రాస్తూనే వున్నాడు— సీటు మాత్రం దొరకడం లేదు డొనేషన్లు కట్టి ప్రైవేటు కాలేజీల్లో చదివించే శక్తి నాకు లేదు-బి.యస్సీ చదివినా అటుతర్వాత దరిదాపుల్లేని నిరుద్యోగారణ్యంలో తిరగాల్సివస్తుందన్న నా భయం- ఇంజనీరింగ్ చదివితేనన్నా కొంత ఆలస్యంగానైనా ఏదో ఉపాధి దొరుకుతుందన్న ఆశ, గొణుక్కున్నాడు ఆనంద్

"నీ పట్టుదల సరే...నీకు మార్గాయాసం లేకుండా ఉండడానికో కథ చెబుతాను విను.... అని చెప్పసాగాడు భేతాళుడు.

రామయ్య ఒంటినాగలి దున్నుకుంటూ బ్రతికే నిరక్షరాస్యుడు తాను నిరక్షరాస్యుడైనా చదువుకున్నవాళ్ళంటె ఆతనికి అపరిమితమైన గౌరవం, చదువే మనిషిని

విజ్ఞానవంతుణ్ని చేస్తుందని ఆతని అభిప్రాయం. చదుకున్నవాళ్ళు నాగరికులని, బుద్ధిమంతులని ఆతని ఉద్దేశ్యం. ఆతనికిద్దరు కొడుకులు.. పెద్ద కొడుకు బడికెళ్ళే వయసొచ్చే నాటికి ఊళ్ళోపాఠశాలేలేనందువల్ల ఆతణ్ని చదివించలేక పోయాడు. చిన్న కొడుకునైనా తప్పక చదివించాలనుకున్నాడు ఐదేళ్ళు రాగానే ఆతణ్ని బడికి పంపించడం మొదలెట్టాడు. పెద్ద కొడుకు రామయ్యకు తోడుగా వ్యవసాయప్పనులు చేసేవాడు

రామయ్య అప్పుడప్పుడు పనులబడి పట్వారి, పోలీసు పటేలు, సర్పంచ్, కారోబారి దగ్గరికెళ్ళేవాడు. ఇంటి పన్నులు, ప్రభుత్వలోనుల్లాంటి విషయాల గూర్చి వాళ్ళను కలిసినప్పుడు వాళ్ళ ప్రవర్తన, లంచగొండితనం చూసి ఆతడాశ్చర్యపోయాడు.. సమితాఫీసుకు కారోబారి వెంటకాని, పైరవీకారి వెంటకాని పోతే ఆతని జేబులో బస్సు కిరాయైనా మిగల్చకుండా ఖర్చు పెట్టించేవారు ఆఫీసుల్లో ప్యూనుమొదలుకొని క్లర్కు, పేష్కారి అంతా పీడించి వసూలు చేసేవాళ్ళే. రామయ్యకు చదువొచ్చిన సర్పంచ్, కారోబారి, పోలీసుపటేలు, పట్వారి, ఉద్యోగులంతా దాదాపు ఒకే విధంగా ప్రవర్తించేసరికి అసహ్యం వేసేది ఆతనికి చదువుకున్న వాళ్ళపైవున్న పూజ్యభావం క్రమక్రమంగా తగ్గసాగింది. బుద్ధిమంతులనుకున్న చదువుకున్నవాళ్ళు కూడా ఇలా ఎందుకు ప్రవర్తిస్తారో ఆతనికి తెలిసేదికాదు..

ఇవన్నీ ఒకెత్తయితే డిగ్రీ పాసయి, ఉద్యోగమైన తర్వాత పెళ్ళి చేసుకొని కొడుకు రెక్కలొచ్చిన పక్షిలా ఎగిరిపోవడం మరో ఎత్తయిందతనికి.. చదువుకొని బుద్ధిమంతుడై తనకు తోడుంటాడనుకున్న చిన్న కొడుకుకాక, వ్యవసాయం చేస్తూ బ్రతికే పెద్దకొడుకే దిక్కవడం చూసి ఆశ్చర్యపడ్డాడతను.. ఓ రోజు చిన్నకొడుకుద్యోగం చేసే చోటికెళ్ళి

అతనింటికెళ్ళాడు. ఇంటి తలుపులు దగ్గరకు వేసున్నాయి. ఇంట్లోంచి కొడుకు మాటలు వినిపిస్తున్నాయి.. కోడలు వెక్కి వెక్కి ఏడుస్తుంది... కొడుకు తిట్లను, మాటలనుబట్టి ఆ గొడవెందుకో అర్థం చేసుకున్నాడు రామయ్య.

థూ నీయవ్వ-చదువుకున్న గాడిదికొడుకులంతా ఒంగలే.. చదువు కున్నడట కొడుకు. కట్నంకోసం కోడలు పోర్నెట్లగోసవుచ్చుకుంటండో సూడు నా లగ్గంల ఇత్తనన్న నూటపదార్లు గూడ ఇయ్యకుంటె నా పెండ్లాన్ని ఒక్క మాటనన్నా? చదువుకునోనికంటె సాకలోడే నయ్యం పెండ్లాన్నెన్న ముద్దుగ సూసుకుంటడు. ఛత్ నీయవ్వ? తనలో తాను తిట్టుకున్నాడు

లోపలికెళ్ళి కొడుకను బాగా తిట్టాడు. "బిడ్డా! మీరు మాకేం బెట్టకుం టేమానాయె... మీరన్న సుకంగుండుండ్రి చిలుకా గోరెంకలొలె కలిసుండుండ్రి.," అని కొడుక్కు, కోడలుకు చెప్పి వెళ్ళిపోయాడు.—

కథ చెప్పడం ఆపి ప్రశ్నలు వేసాడు భేతాళుడు "మొదట రామయ్య చదువుకునోళ్ళంతా బుద్దిమంతులను కునేవాడు తర్వాత చదువుకునోళ్లంతా ఒంగలే అన్న అభిప్రాయానికొచ్చాడు.. ఇందులో ఏ అభిప్రాయం సరైంది? అతని మారిన అభిప్రాయం మొత్తం చదుకువునోళ్లకు వర్తిస్తుందా? ఈ ప్రశ్నలకు జవాబులు తెలిసీ చెప్పక పోయావో... అనిఅగాడు భేతాళుడు.

" మట్టిలో పుట్టి మట్టిలో పెరిగి, మట్టినే నమ్ముకొని బ్రతుకుతున్న రామయ్య లాంటి నిరక్షరాస్యుడికి చదువుకున్న వాళ్ళమీద మొదట్లో సదభిప్రాయముండటంలో వింతలేదు. చదువులు మనిషిని వివేకవంతుణ్ని చేస్తాయని, నీతి నియమాలు కలవాడిగా తీర్చిదిద్దుతాయని ఆతననుకోవడంలో తప్పులేదు. కానీ చదువులు పొట్టకూటి చదువులని. మనిషిని తీర్చి

ఉద్దే చదువులు కావన్న అతనికి తెలియదు చదువుకున్నవాళ్ళు తమకున్న అక్షరజ్ఞానంతో చదువురాని పల్లె జనాన్ని తమ దగ్గరికొస్తే పీడించి డబ్బులు గుంజే సంగతి రామయ్యకనుభవంలోకి వచ్చేవరకు తెలియదు. చదువుకున్న వాళ్ళమీద సదభిప్రాయమున్న రామయ్యకు పట్వారీలాంటి చదువుకున్న వాళ్ళంతా ఒకేలా ప్రవర్తించేసరికి అభిప్రాయం మారసాగింది.... తాను కనిపెంచి విద్యాబుద్ధులు చెప్పించిన కొడుకుకూడా ఊహించిందానికి భిన్నంగా పరివర్తించేసరికి రామయ్య చదువుకున్నోళ్లంతా లంగలే అనుకున్నాడు

అయితే రామయ్యకు తటస్థించిన వాళ్ళంతా ఈ వికృత ధనస్వామ్య వ్యవస్థలోని కుక్కమూతి పిందెలన్న అతనికి తెలియదు. చదువులయొక్క అసలు స్వరూపమూ అతనికి తెలయదు. అందుకే తన అనుభవాల ఆధారంగా తన మొదటి అభిప్రాయాలను మార్చుకున్నాడు.

అతని రెండభిప్రాయాలూ పాక్షికంగానే సరైనవి. ఎందుకంటే చదువుకున్న వాళ్ళంతా బుద్ధిమంతులో, లంగలో కారు... చదువుకోనంత మాత్రాన బుద్ధిహీనులూ కారు. బుద్ధి, నీతి అనేవి సంస్కారంవల్ల వస్తాయి. కాని ఈ చదువుల వల్ల కాదు "

ఆనంద్‌బాబుకు మౌనభంగం కాగానే శవంతో సహా మాయమై మళ్ళీ చెట్టెక్కాడు భేతాళుడు

—★—

[జీవగడ్డ 23మార్చి 86]